


# కథావశిష్టులు ✿ పయశ్శ్రీ రమణారావు

భయపడ్డంతా అయింది. బెంగపడ్డంతా జరిగింది. అంతా వొక్క క్షణంలో. నా(లోజులయింది మాట పడిపోయి. రెం(డోజుల్నిం చయితే చూపేలేదు. అదుగో అప్పట్నుంచీ ఘడియోక్షణవో అని అనుకుంటూ వున్నదే. అయిదు నిమిషాల క్రితం ఆఖరుసారిగా కళ్ళు తెరిచినప్పుడు సంబరపడ్డంతసేపు నిలబళ్ళేదాచూపు. అది తెరవడవూ కాదు, చూపు అంతకన్నా కాదు.

వారం రోజులాయి నీళ్ళూ నిప్పులూ లేకుండా వొక్కలా మంచం దగ్గిరే పడిగాపులు కాస్తోన్న ముత్యాలమ్మ కన్నుగప్పి ముందుకొచ్చేసింది ఆ ఆఖరు క్షణం. గురక వినిపించక పోయే సరికి ఉలిక్కిపడింది. రెప్ప ఆడకపోవడంతో అల్లల్లాడిపోయింది. బల్లిలా మంచానికంటుకుపోయిన మొగుడి వొళ్ళు మంచుగడ్డలా తగిలీసరికి భయంతో వెన్ను జలదరించినట్టయి నిలువునా స్తంభించిపోయిందామె వొక్క క్షణం. మరుక్షణంలో జరిగిందేవిటో తెలిసొచ్చేసరికి గొల్లుమంది. గుండెలు బాదుకుంటూ పిచ్చిగా మంచం చుట్టూ తిరిగింది. వొళ్ళూపై తెలీకుండా మంచం కోడుకేసి తల మొత్తుకుంటూ గోల పెట్టేసింది.

"మంచంమీనాగ్గిసినాడేటోలమ్మ పేనాలూ..."

"జీవుడు మాకష్టపడిపోన్డు..."

"ఎంత కష్టం వొచ్చిపడిపోనాది ముత్తేలమ్మతల్లో నీకూ..."

"వొల్లకోయమ్మొల్లకోయే..."

"సచ్చినాళ్ళతోపాటుచ్చిపోగలవేటొల్లకోయే..."

"పిల్లణ్నాడే ఎలగ బెగిలిపోతన్దో..."

"ఆకాయన్నాసుకునైనా దయిర్నం తెచ్చుకోయే తల్లీ..."

"ఈ జనమకంతేరాసినాడు బగుమంతుడనుకోని ఏద్దుకోవాలే వ్రితల్లి ఎవుల్లైనా..."

".....సాల్నాలు. మీ ఆడాళ్ళ ఏదంతాలకేటిగానీ దాన్నలా లోపలకి తీసుకెల్లండోసెణం"

".....మీారేట్ర గుంటపాపలూ మంచం సుట్టూ దడిగట్టేసినారెల్లండెల్లండి"

"ఆడాల్తో పాటేట్ర మీరూ సోద్దెంసుస్తా నిలబడి పోన్నూ బొమ్మల్నాగ"

".....ముంజారుకిందల్లాసింకిసాపాడీసినాలుగడ్డి పరకల్తెచ్చి పరంద్రా"

".....వోర్యేంకలాసూస్తనూ...అలా తలాపి దిక్కొల్లి పట్టుకోండొకల్లూ"

".....జేగరత జేగర్దింపండి...ఇలా ఇలా... దచ్చినం దిక్కొట్టండాతలా"

".....న్నారాయన్నారాయన్నారాయన"

"వోలెవల్రక్కడా...తలదిక్కున వో దీపం ఎట్టండెవరో వోళ్ళిలా వొచ్చీ......"

తలోమాటా...తలావోచెయ్యీ, శవాన్ని భూశయనం చేసారు.

"తప్పుకోండ్తప్పుకోండి...అసిరయ్యతాతొస్తన్డు..."

ఆ పల్లెకి-మూడుతరాల ప్రతినిధీ, కులపెద్దా, తొంభయ్యేళ్ళ తొక్కూ-అసిరయ్య తాత. "అదృష్టమంతుడు" వొచ్చి శవం పక్కన కూర్చుని, శవం కళ్ళు మూస్తూ- అన్నాడసిరయ్య. కబురందుకుని కళ్ళాల్లోనూ, గరువుల్లోనూ వున్న తక్కిన ఆ పల్లెజనం కూడా పరుగుల మీద వొచ్చి చేరుకున్నారప్పటికి. పరామర్శలూ, వోదార్పులూ, ఊరడింపులూ మధ్య ముత్యాలమ్మ గుండె చెరువయిపోయేలా ఏడుపులూ, పెడబొబ్బలూ. ఊరు కోబెట్టేవాళ్ళ మందలింపుల కేకలూ. ఆ గందర గోళంలో—

"ముసిల్దాయిక్కబురెల్లిందేవో కనుక్కోండొరే పిల్ల దాన్నీ..." అన్నాడసిరయ్య లోపలికి వినబడేట్టూ.

"మాటాడిపోయినప్పుడే ఎట్నాదికబురు..." ముంజూరుకవతల గిడపమీాదున్న గంగమ్మ అంది.

"సచ్చీకాలానికి కొడుకున్నాడుండకుండ కొంప మునిగిపోతన్నట్టు కూతురకాడ కెల్నాడేటిదీముసిల్ది..."

"కొరివితప్ప కొడుకేటెడ్తాడనుకొంది గావాల..."

"పేరమ్మత్తే పురుటొద్దులు కావొస్త్రా..."

"ూకుంటే నెగనేద్ది ఇదేటి సేస్తాదెల్లీ..."

"ఇదేటి సేస్తాది...నాలుగ్గింజలొస్తాయికాదా అల్లుడోడికి...తండికోసవే ఎల్లి కూకుదుందక్కడ..."

"వోలొల్లకోండే...సచ్చీకాలానికి సెట్టంత కొడుకు నెల్లబెట్టేసుకున్నాకున్న ముసిల్దాయిమీాదనెగడానికిదేనేటే సమయం మియ్యాకూ...కబుర్లు సాలించి దనిక్కబురెల్లే దారిసూడండిబేగి..." అసిరయ్య వొక్క ఖసురు కసిరేసరికి ఆడాళ్ళ నోళ్ళు అక్కడితో మూతబడటంతో కబురందించి ముసిల్దాన్ని తీసుకొచ్చే బాధ్యత మొగాళ్ళ మీద పడింది.

ఏపూట బత్తెం ఆపూటకి వెతుక్కునే గోచీపాత రాయుళ్ళే. చుట్టుపక్కల పదిపదిహేను గ్రామాల్లో పొలం పుంతకోసం కడుపు చేతపట్టుకు తిరగే వ్యవసాయ కూలీలే ఆ పల్లె జనాభా అంతానూ. అక్కడికి



"తెల్లారీనోపల వొల్లాపురం కబురెల్లడవెప్పుడూ... ముసిల్దాయి రాడవెప్పుడూ..." ఎవరో గొణిగేసరికి

"తల్లిక్కబురెట్టకండ దానపరిసేస్తావంటారే గ్రయితే..." అడిగేడసిరయ్య చిరాగ్గా.

"ఆకరువు బస్సుకూడా ఎల్లిపోతాదీపాటికి...ఎవులేనా ఎలగెల్లడవు..."

"ఎలగోనాగెల్లాల...ఇంతమందిరుండయ్యేం మాటగ్రలా..."

"అదికాదుర తాతా..."

"ఇంకేటి సెప్పకండినాకు...ముసిల్దాయొచ్చీవరకూ రావులిగోడి శెవం కదల్దు..."


......ఆ పల్లెకి అసిరయ్య తాతమాట శివాజ్ఞ!

ఆ ముక్కతో పదిమందీ లేచి పదిళ్ళా వెతికి దారిఖర్చులికి కటాకటి జతపరచి అటు శ్రీకాకుళంనుంచి ఇటు విజయనగరం దాకా అప్పడాలమ్ముకుంటూ ఆ దారంతా కొట్టినపిండిలా తిరిగే పోలయ్యని బాబ్బాబు అని బ్రతిమాలి ఆ చలిరాత్రి వల్లాపురం పంపించేసరికి వచ్చీ చావయింది పల్లె వాళ్ళకి.

** ** ** **

మార్గశిర మాసపు దట్టమైన మంచుతో కప్పడిపోయిన ఆ పల్లెగుడిసెలమీద పంచమి చంద్రుడు మసక మసగ్గా వెన్నెల పోస్తోన్న ఆ ఝామురాత్రివేళ ముత్యాలమ్మ గుడిసె దగ్గిర శవజాగరణ జరుగుతోంది. ఏడ్చి ఏడ్చి వోపికలేక సొమ్మసిల్లినట్టు పడిపోయున్న ముత్యాలమ్మ చుట్టూ దడికట్టినట్టు కూర్చున్న ఆడవాళ్ళు పాత పురాణాలు తవ్వి తలపోస్తున్నారు. శవం తల దిక్కున ముక్కాలిపీటమీదుంచిన డొక్కుదీపం గాలికి రెపరెపలాడుతున్నప్పుడల్లా శవం మొహం వికృతంగా కదుల్తున్నట్టనిపిస్తోంది. గుడిసెలముందు వాకిళ్ళల్లో దొప్పకర్రల్తోటే ఎండిన శెలగరొడ్డతోటే వేసిన చలి మంటల చుట్టూ మొగాళ్ళు గొంతుకిలా ముడుచుక్కూర్చున్నారు. శవం వాసన పసికట్టిన నక్కలు పల్లె పొలిమేరల్లోకి వొచ్చేసి వుండీ వుడిగీ వూళలు పెడుతున్నాయి. సమాధానంగా పల్లెలోంచి కుక్కలూ మొరుగుతున్నాయి. మధ్యలో కీచురాళ్ళు గీపెడుతూ రొదచేస్తున్నాయి. ఎక్కణ్ణుంచో వో తాగుబోతు సాధ్యమయినంత అపశృతిలో "ఏమిజన్మంబేమి జీవనం" అంటూ చేస్తోన్న రాగాలాపన అక్కడి విషాద దృశ్యానికి నేపథ్య సంగీతంలా అప్పటప్పట గాలిలో తేలితేలి వొస్తోంది. ఆ చలిలో...ఆ గుడ్డి వెన్నెట్లో...ఆ పల్లెకే చావొచ్చినట్టుంది—ఆ రాత్రి!

ముత్యాలమ్మ గుడిసెముందు వాకిట్లో వేసిన చలి మంట చుట్టూ కూర్చున్న ఆ పల్లెలోని పెద్దల మొహాలు ఆ మంటల కన్నా ఎర్రెర్రగా కదుల్తున్నాయి. వాళ్ళ బుర్రల్లో అంతకన్నా ఎర్రగా దొలిచేస్తోమంట పెట్టేస్తూన్న ఆలోచనంతా-'తెల్లార్తే శవాన్ని కదిపేదారి' ఏవిటని? చాలా సేపట్నుంచీ వాళ్ళని అంతర్గతంగా భయపెడ్తోందా సమస్య. ఏదారీ వాళ్ళకి తోచక పోవటానికి ఆ పల్లె జనాభాలో నూటికి నూరు శాతం



కోసెడు దూరంలో వున్న వో పెద్ద గ్రామానికి 'శివారు' ఈ కుగ్రామం. అంచాత ఆమాత్రం ఈమాత్రం ఆ వూళ్ళో భూవసతున్న మోతుబర్లెవరూ ఆవూళ్ళో కాపరం వుండరు. పల్లె జనాభాలో తప్పీజారి ఏ ఇద్దరికో ముగ్గురికో ఎకరవో, అరో మడిచెక్క వున్నా అదెప్పుడూ ఆ పెద్ద గ్రామం షాహుకార్ల దగ్గర తాకట్లోనే వుంటుంది. దానిమీద వడ్డీ అసలుకు మించి పెరిగి పోయి తాకట్టు వాకట్టయిపోడానికి సిద్ధంగానే వుంటుంది. కనక తమకోమడి చెక్క వుండేదన్న విషయం మరచిపోయుంటారలాంటి వాళ్ళంతా. అంచేతే రెక్కాడితేగాని డొక్కాడని పూట బ్రతుకుల వాళ్ళకీ బ్రతుకే కాదు... చావూ సమస్యే!

'ఎలా?' అన్న ఆలోచనతోనే నిద్రపట్టక కుక్కి మంచంలో చాలాసేపట్నుంచీ దొర్లుతూన్న అసిరయ్య 'ఇలా లాభంలేదు' అనుకుని లేచిపోయి, వాకిట్లో చలి కాగుతూన్న వాళ్ళ మధ్యన జాగా చేసుక్కూర్చుని, చెవి సందులోనున్న చుట్ట తీసి మందుతోన్న చొప్పపుల్లతో అంటించుకుంటూ "తెల్లారి శెవాన్ని కదిపేదారేటన్నాలోసించార్రా సిమ్మాద్రీ" అనడిగేడు.

"అదాపడకే సేతులు ముడుసుక్కూకుదున్నం మావూను" అన్నాడా సింహాద్రి చాలా విరాగ్గా.

"కూకుడుంటే ఎలారా...ఏటో వోటి పగించాల గాని..." చెప్పగా రెండు దమ్ములు పీల్చుకుంటూ అన్నాడసిరయ్య.

"ఏపగింపీడానికదేటి సుట్ట కర్సుకున్నావేట్రా తాతా..." ఈ పక్కనున్న నారయ్య అన్నాడసహనంగా. అప్పటికే ఏంతోచక వాళ్ళంతా మతులు పోగొట్టుక్కూర్చున్నారన్న త్తేల్చేసుకున్న అసిరయ్య 'ఇలా కూడా కాదు' అనుకుంటూ అక్కణ్నుంచిలేచి శవాన్నుంచిన ముంజూరు దగ్గరకొచ్చి-"గంగమ్మ వుందర్రేక్కడా" అంటూ అడిగేడు. ఆ పల్లెలోవున్న ఆడంగుల్లో గంగమ్మే వ్యవహర్త. మంచికైనా చెడ్డకైనా అందర్లోకీ ముందుం టుంది. కష్టాప్పగల నాయురాలు.

"ఏం మావ పిలిచినవు" లోపల్నుంచొచ్చి అసిరయ్య దగ్గర చతికిలపడుతూ అడిగింది గంగమ్మ.

"సూడు మేనకోళ్ళా...తెల్లారి శెవం ఎల్లాలికద... మనవరాల్దగ్గిర జేగర్పేసిందేటన్నుందేవో కనుక్కోమి..." అలాటప్పుడు అడక్కూడనిదే అయినా-గత్యంతరం లేకా, కనపడకా-ఎంతో నెమ్మదిగానే అడిగినా; ఆ ముక్క కాస్తా ముణుకుల్లో తలదూర్చుకుని, తెల్లటి వుండలా ముట్ట ముట్టుక్కూర్చున్న ముత్యాలమ్మ చెవిని పడగానే-ఆమె గుండె గతుక్కుమనిపోయింది. మోకాళ్ళ సందులోంచీ కనపడుతోన్న మొగుడి మొహాన్ని మాట్టానికే భయపడి కళ్ళు మూసుకుందామె. తెల్లార్తే మొగుడి శవాన్ని దహన పరచాలన్న సంగతి గుర్తుకు రాగానే గుండె బేజారయి పోయిందామెకు. బ్రతుక్కేర్పడ్డ గాయాన్ని కెలు కుతూ అతి దయనీయంగా కడచిన పరిస్థితి అంతా ఆమె కళ్ళల్లో వొక్కక్షణం గిర్రుమంది.......మూడు నెల్లాయి మొగుడు జబ్బు ముదిరిపోయి మంచం దిగని పరిస్థితి ఏర్పడిందగ్గిర్నుంచీ

# ప్రపంచపదులు

**1**

సముద్రానికి చమురు పూస్తే జిడ్డు
పడుతుందా?
హిమనగానికి బొగ్గు పూస్తే నల్లబడుతుందా?
తలుపులూ కిటికీలు ఎంతగ మూసుకుని
వున్నా-
తరుముకొచ్చే కాలవాహిని తిరిగిపోతుందా-
ముసురుకొచ్చే ముదిమి తన వల విసర
కుంటుందా?

**2**

మసక పట్టిన అద్దమైనా ముఖం చూడక
మానుతామా?
ముసురుపట్టిన వేళనైనా ముందు సాగక
ఆగుతామా?
ఎన్నడో ఒకనాడు మృత్యువు తన్నుకొని
పోతుందిలే అని
దడలు పుట్టిన గుండెలో రక్తాన్ని పంపక
ఆపుతామా?
నడుంకట్టిన ఆశయాలకు పిడికిలెత్తక
వీగుతామా?

\- డాక్టర్ సి. నారాయణరెడ్డి

వున్న లొడ్డా లొసుగూ మందుకీ మాకుకి ఊడ్చిపెట్టుకుపోగా; మొగుడు మొత్తు కుంటున్నా వినక ఆశ చావక; ఆడపడుచు దగ్గిరకి అత్తనలా వెళ్ళనిచ్చి; ఇలా షావుకారు దగ్గరకు పరుగెత్తు కెళ్ళి కాళ్ళావేళ్ళాపడి అప్పటికే అప్పుతో పూర్తిగా మునిగిపోయిన మడిచెక్కమీద వచ్చేదీ సంపాదించిన అయిదొందలూ విశాఖపట్నం పెద్దాసుపత్రికే హార తిచ్చేసి-'లాభంలేదు' అనిపించేసుకుని మొగుణ్ణే మోసు కొచ్చేసిందగ్గిర్నుంచీ ఇంత జావకాచి పోయడానికైనా గుప్పెడు గింజలు ముష్టిక్కూడా దొరక్క; తనూ కొడుకూ ఎండిన కడుపుల్తో మొగుడికి కాపలా కాసి కాసి చావుకప్పచెప్పేదం...ఇక బ్రతకడన్న కబురు ఖరారుగా తెలుసుకుని ఆఘమేఘాలమీద ఆదరాబాదరాగా పరుగెత్తుకొచ్చేసిన షావుకారు క్రయదస్తావేజుమీద మొగుడి వేలి ముద్దర్లేయించుకుని తమ బ్రతుకులకి వొకే వొక్క ఆసరాగా మిగిలిన ఆ మడిచెక్కని కాస్తా దఖలు పరిచేసుకుని నిశ్చింతగా ఊపిరి పీల్చుకునెళ్ళిపోవడం...మొగుడికి చావు తెలివొచ్చిన క్షణంలో-'అయిపోయిందే ముత్తేలూ అంతా అయిపోయింది...నా సావు తప్ప మరేటీ మిగల్లేదు...ఇయాలోరేపో అదీ ముంచుకొచ్చేస్తాది...నీ బతుకద్దాంతరపరిసేసి అన్నేయం సేసేసి నా దార్నేనూసుకునెల్లిపోతున్నానే...' అఖరు సారిగా మొగుడన్న మాటలు గుర్తుకు రాడవూ... దాంతో అంతవరకూ నివురుగప్పిన నిప్పులా అణిగివున్న బ్బవుపడుతోన్న ముత్యాలమ్మ దుఃఖం వొక్కసారి భగ్గుమని రాజుకుంది. ఇంకేవుందీ ముత్యాలమ్మని పట్టు కోడం శక్యం కాలేకపోయింది ఆడవాళ్ళకి మళ్ళీ. ఆ పెడబొబ్బల్తో చిన్నమాగన్నుగా వున్న ఆ పల్లెకి ఆ రెండో ఝామురాత్రివేళ పూర్తిగా తెలివొచ్చేసింది.

"నీకు తెలిని జేగర్తేటుంటదసిరయమామ...ఎక్కణ్ణేస్తీ ఆడిజబ్బుకేఅరతయిపోనాది...చివికెలూ బొచికెలు తప్ప దవిడ్దగ్గిరేటి మిగిల్నాయింక...ఏదో దార్నూసి నివ్వే ఈ యాపదొడ్డెక్కించాలసిరయమావా..." అంటూ గంగమ్మ విషయం తేల్చేసెయ్యటంతో; వెనక్కి తిరిగి మళ్ళీ చలిమంట దగ్గిరకొచ్చేసి చతికిలపడిపోయి-"ఏట్సేద్దుంర సిమ్మాద్రయితే-" అడిగాడసిరయ్య నిట్టూరుస్తూ.

"తెల్లార్నీ" కష్టదాయకంగా అన్నాడు సింహాద్రి.

"తెల్లారేకేపగించటం మొదలెడ్తే ఎప్పుడికి తెవులాదిరా..." అసిరయ్య అన్న ఆ ముక్కకి-

"ఈ రేత్రప్పుడెందంపడి సచ్చిపొమ్మన్నవు రయితే..." చాలా విరాగ్గా కసిరేసినట్టన్నాడు గురువులు. సమస్యలొచ్చినప్పుడు చిరాకు పడిపోతే లాభంలేదనుకున్న సావధానంతో అసిరయ్య కొత్త చుట్టోటి ముట్టించి-ఆలోచాలోచించి చివరకి వో నిశ్చయానికొచ్చి-"నెగండ్రా..." అన్నాడు కొత్త దొప్పపుల్లల్ని వేసి మంట మరింత పెద్దది చేస్తూ-

"నెగిసి-" ముసలాడి ఆలోచన ఓపట్టాన అంతు బట్టక - అడిగాడు సింహాద్రి.

"నెగిసెల్లి సావుకోర్ని నెగ్గొట్టడగండ్రా దానకర్సు కేటన్సర్దమనీ-" కణకణ మండే మంటలోకి తీక్షణంగా మాస్తూ అన్నాడసిరయ్య.

"సర్లే" షావుకారు సంగతి బాగానే ఎరగటంవల్ల నిరాసక్తంగా, నిరుత్సాహంగా దీర్ఘం తీసేడు సింహాద్రి.

"సచ్చీకాలానికి ముసిలోడికి మతోతందిగావాల..." వేళాకోళంగా వెనకనుంచి ఎవరో గొణిగినట్లుగా అనే సరికి -

"నెక్కాడొక్కా ఏట్సొప్పుకండ-ఆ తల్లిముండ లేకుండ సూసి-సచ్చీముందర ఆడిసేత బ్రాదిరయిం దీసుకున్నోడూ ఆణ్ణే బుగ్గిసేసేడానికి కామాత్తరం దరమంగైన ఇయ్యనేడేట ...అడగండిరెల్లీ...ఎల్లడగటంలో తప్పేట్నోదుకద-" ఉక్రోషం ముంచుకొచ్చేసింది.

"పెల్లికి ఖచ్చం ఎట్టనోడు శెవానికి దానకర్సిస్తాడ్రా తాతా ఏ పిచ్చిగానీ..." అన్నాడు నారయ్య చప్పగా.

"ఎల్తే మనకి కాల్లపీకుడు తప్ప ఆడిదగ్గిర్నుంచి కాస్తబ్బులొచ్చేదేట్నోదు..." ఇంకా సింహాద్రి ఇలా అంటున్నాడో లేదో-"ఆడి బాబు సొమ్మేటిచ్చీమన్లేదు రయ్యా..." చాలా తీవ్రంగా వినిపించిందో కొత్త గొంతు. రక్తంలోని వ్రరదనం మాట్లాడతున్నట్టావున్న ఆ కొత్త గొంతూ-నారయ్య కొడుకు ఎరుకులిది.

"ఆ మన బాబు సొమ్ము దాచపెట్టినాం ఆడి దగ్గిరా..." నారయ్య నవ్వుకుంటూ-

"చావ బెట్టడవేం కరమరా...దోచేబెట్టేనవురోరయ్యో వొడ్డీం మీవొడ్డీలు గట్టి తాతలు సంపాయించిచ్చిన మన మడి సెక్కాలన్నీ అడికే దొబ్బెట్టేనావురయ్యో! ఆ సెక్కాలన్నీ మనం అడిగినంతెప్పుడేనా... బతికుండగనే సంపీవాదు మమ్మి... సచ్చేక తగలెట్నానికడిగి తొప్పేటోన్ని దురయ్యో" ఇది మరో కొత్త గొంతు. ఏప్పుడు కురిపిస్తా మండే ఈ గొంతూ- సింహాద్రి కొడుకు కొండడిది. నీళ్ల వొంటికి కండలూ, మూతికి మీసాలూ ఇప్పుడిప్పుడే వొస్తున్నాయి. జానిసర్కాపు చెట్లకి పూసిన తిరుగుబాటు పువ్వులు నీళ్ళు.

"ముసిలోడు సెప్పింది సబువుగుంది... సావు కోరవు పడితే కానీ సరకా ఆదుక్కోలినే ఈళ్లేటెల్తారు సెగంండ, మనవెళ్లదుగుదం పదండ" రక్తం మరగటం అప్పుడప్పుడే ప్రారంభం అవుతోన్న కుర్రకారంతా కర్రలమీద ఉవ్వెత్తున లేచి ఆవేశంగా అరిచింది. అయితే వాళ్ళకి ఆవేశమే తప్ప అనుభవం లేకపోవడం వల్ల వ్యవహారమే చెడిపోతుందేమో అని భయపడి పోయిన అసిరయ్య వాళ్ళని వారిస్తూ "మీకేం తెలదుండండ్రా, అళ్ళే ఎల్తారు. మీ పాటి పొరుసాలాళ్లకి మాత్రం లేవేట్రా. సెగండోరే సిమ్మాద్రీ... నారయ్యా, వొళ్ళె గరా గురువులూ- సెగి సెల్లడగండిర. అడిగితె తల్లీసి మొలేస్తాదేటెల్లడగండ..." అంటూ వాళ్ళని రెచ్చగొట్టి బలవంతాన లేవదీసాడు.

"ముసిలాడోపితలాటక వెట్టదు... మాకావ్వంజి కొదుకు" అని తిట్టుకుంటూ, విసుక్కుంటూ- కుర్రాళ్ళ దగ్గర మరీ చులకనయి పోతావేమోరా అన్న పౌరుషం కొద్దీ లేచి- ఆ చలిలో, గుడ్డి వెన్నెట్లో పడి బయల్దేరారు ఆ మూడో ఝాము రాత్రివేళ ఆ పెద్దల్నలుగురూ!

* * *

అక్కడికి దగ్గర దగ్గర మూడు కోసుల దూరంలో వున్న ఆ గ్రామం ఆ చుట్టుపట్ల పల్లె పట్టులకు సరుకూ సబ్బరా అందించేటి చిన్న వ్యాపార కేంద్రం. ఆ ఊరి జనాభాలో ఎక్కువ భాగం షావుకార్లే. అప్పడాల తయారీ వాళ్ళ ముఖ్య వృత్తి. ప్రతి ఇంటా అదో కుటీర పరిశ్రమ. అటు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇటు విశాఖ పట్నం జిల్లా కోసాకీ ఆ ఊరి అప్పడాలకి మంచి గిరాకీ. అప్పడాలు తయారు చేస్తూనే వో పక్క కిరాణా, మరో పక్క బట్టలూ అమ్ముతూ వుంటారు. ఆ పైన చుట్టు ప్రక్కల తైతాంగం మీద వడ్డీలకీ, తాకట్లకీ కొద్దో గొప్పో డబ్బు తిప్పుతూంటారు. ఒంటి మీదకి గుడ్డ ముక్క కూడా లేనట్లలా అవుపడుతూంటారు గాని ఆ వూరి షావుకార్లందరూ లక్షాధికార్లే. ఆ గ్రామంలో తాకట్ల వ్యాపారంలో అందెవేసిన చెయ్యి గున్నయ్య శెట్టిగారిది. పట్టింది వాకట్టయిదాకా తోచదతగాడికి. మనుషుల అవసరాలూ, బలహీనతలూ, దారిద్ర్యం ఆధారంగా అతగాడి వ్యాపారం పచ్చ పచ్చగా ఆ ప్రాంతం అంతటా విస్తరించి వుంది. డబ్బు వొక్కటే సమస్త ప్రపంచం అతగాడికి.

తొలికోడి కూసే వేళకి గున్నయ్య శెట్టిగారింటి ముందున్న వాకిట్లో కొచ్చి నిలబడ్డారు సింహాద్రి వాళ్ళూ. నలయ్యేదీ- దాని బాబయ్యేది వొంటి నీద గుడ్డయినా లేకుండా నీధరుగు మీదే పడుకుంటాడు శెట్టిగారు. పడుకోడం అంటే కోడి కునుకే. వాకిట్లో మనుషుల అలికిడికి చప్పున తెలివొచ్చే సరికి శెట్టిగారికి తలల నిండి గుడ్డలు కప్పుకుని, చేతిలో పొడవాటి కర్రలు పట్టుకుని నిలుచుండిన వాళ్ళు నలుగురూ ఆ గుడ్డి వెన్నెట్లో దోచుకుపోవడానికొచ్చిన దొంగల్లా కనపడే సరికి గాభరాగా లేచిపోయి అరుగు కొసాకి వొచ్చేసి "ఎవుర్రదీ"- అంత చలిలోనూ తడారి పోయిన గొంతుతో బొంగురుగా అడిగే వేళకి- సింహాద్రీ వాళ్ళు నిచ్చెక్కి అరుగు మీద కొచ్చేసి "మాం బావు అప్పాపుర పోల్లం" అన్నారు నెత్తిమీద గుడ్డలు తీసి, ముందుకెళ్ళి. మనుషులతోటిదే నిత్యం తన వ్యాపారం అవటాన్న మొహాలూ, గొంతులూ చప్పున పోల్చేసే శెట్టిగారు కుదుటపడి, వెనక్కి వెళ్ళి తాపీగా మంచం మీద కూర్చుని "ఏవిర ఇలగొచ్చేరూ" అనడిగేడు. "నచ్చిమ్మ కొడుకు రావులు గోణ్ణెక్కండి... చిన్న పొద్దు గూకేయేళకి. సచ్చిపోనడండి బావు" చావు కబురు చల్లగా చెప్పేడు సింహాద్రి.

పనికొచ్చేదయితే చావు కబురైనా ఇంపుగానే వినబడుతుంది శెట్టిగారికి. ఈ రావులితోటి వ్యవహారం వాడు బతికున్నప్పుడే పక్కాబద్దంతో "శుక్కురారం పూటా చావు కబురు చెప్పడానికే నేట్రా పనిమాలా లెగ్గొట్టి వొచ్చీ" శెట్టి కంయ్యిమన్నాడు మంచం మీంచి లేచిపోయి. అప్పటిగ్గాని వాళ్ళకారోజు శుక్రవారం అన్న సంగతెల్తీసింది కాదు. శుక్రవారాలు వొస్తే పువ్వు కోడనే గాని, చస్తే వొకళ్ళకివ్వడం అంటూ షావుకార్ల జాతకంలో వుండదన్నది జగమెరిగిన సత్యం కావటం చాత- వొచ్చిన ఆ నలుగురికీ మోకాళ్లు విరిగినట్లయి పోయింది. కాళ్ళ పీకు కళ్ళల్లో కొచ్చేయటంతో నీరసం ముంచుకొచ్చేసి చతికిలపడిపోయారా నలుగురూ.

బతుక్కయినా, సావుకయినా,మిమ్మల్నదుక్కోపోతే మాం ఎవులికాడ కెల్తాం బావు..." అన్నారు లేని ధైర్యం



## వాడవాడలా వీధి నాటకం 'కైలాసంలో కోర్టు'

తెలుగు నాటకాన్ని నాలుగ్గోడల మధ్య కాకుండా నేరుగా ప్రజల మధ్యకు వెళ్ళి జరుగుతున్న సమస్యలు కళ్ళకు కట్టినట్టుగా చూపించాలనే లక్ష్యంతో రెండేళ్ళ క్రితం వ్రాసిన 'టామీ-టామీ-టామీ' అనే వీధి నాటకాన్ని డాక్టర్ రాజారావు ఆర్ట్ మెమోరియల్ అకాడమీ బి.బాబూరావు దర్శకత్వంలో విజయవాడలో తొలి ప్రదర్శన ఇచ్చింది. ఈ వీధి నాటక ప్రక్రియ ఇప్పటివరకు వాడవాడలా ప్రదర్శనలు ఇచ్చి అందరి అభిమానం చూరగొంది. ఇటీవల ఈ పద్ధతిలో నిర్వహించిన మరొక కొత్త ప్రయోగం 'కైలాసంలో కోర్టు' ప్రదర్శన. శ్రీ బాబూరావు రచించి, దర్శకత్వం వహిస్తున్న ఈ వీధి నాటకాన్ని వారం వారం వీధి ప్రదర్శనలు ఇస్తూ వున్నారు. ఇటీవల కళాసాగర్, శివరంజని సంయుక్తంగా నిర్వహించిన మద్రాసు పోటీలలో ప్రదర్శించి ఆత్రేయ, గుమ్మడి, వి. మధుసూదనరావు, జంధ్యాల, ఎం.ఎస్. రెడ్డి వంటి ఎందరో సినీ ప్రముఖుల అభినందనలను ఈ బృందం అందుకున్నది. నటులు వి.వి.ఎస్. ప్రతుడు, బి. పుల్లారావు, కె.ఎస్. కుమార్, డి. బాజ్జీ, కె. సత్యనారాయణరెడ్డిగార్ల సహకారంతో ఈ నాటిక వీధి ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈ కొత్త ప్రక్రియను చేపట్టి డాక్టర్ రాజారావు ఆర్ట్ మెమోరియల్ అకాడమీవారు, దర్శకత్వం వహించిన బి. బాబూరావు, వారి బృందం ఎంతయినా అభినందనీయులు. ఇటువంటి సరికొత్త ప్రయోజనకరమైన ప్రక్రియను పోషించి పరిరక్షించు కోవలసిన బాధ్యత మనందరికీ వున్నది.